5న చలో ఢిల్లీ విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి - తణుకురూరల్

మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.దక్షిణామూర్తి, కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో గ్రూప్ మీటింగులు నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రయివేటీకరణ ఆపాలని నినదించారు. కార్యక్రమంలో నేతలు గోపి, ఆదినారాయణబాబు, వెంకటేశ్వరరావు, బ్రహ్మజీ, టి.రామకృష్ణ, ఎస్.చిన్నారావు, ఎస్.శ్రీనివాసరావు, రమణ, బాలాజీ, సూరిబాబు, పద్మారావు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: ఈ నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలో తుందుర్రు, బేతపూడి, యమునాపల్లి గ్రామాల్లో శనివారం కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు.

ఆ వడ్డీ వెనక్కివ్వండి..!

సహకార సంఘాలపై డిసిసిబి ఒత్తిడి

2010-13 మధ్య రైతులకిచ్చిన వడ్డీ రాయితీ రూ.27.51 కోట్లు

అది తిరిగి కట్టాలని హుకుం

అవినీతి వ్యవహారాలతో డిసిసిబి క్యాష్ రేషియో 6.25కు పతనం

అది పూడ్చుకునేందుకు సహకార సంఘాలను చిదిమేసేందుకు సిద్ధం

రైతులకిచ్చిన సొమ్ము ఎలా కట్టాలని సహకార సంఘాల ఆందోళన

ఆడిట్ అభ్యంతరాలపై సమాధానమివ్వని డిసిసిబి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సహకార సంఘాల మనుగడను ప్రశ్నార్థకంగా మార్చేందుకు డిసిసిబి (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) పూనుకుంది. అవినీతి వ్యవహారాలతో డిసిసిబికి వచ్చిన నష్టాలను సహకార సంఘాలపై మోపేందుకు ప్రణాళిక రచించిందా.. ప్రభుత్వం నుంచి వడ్డీరాయితీ సొమ్ము రాలేదనే నెపంతో రూ.కోట్ల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా సంఘాల నుంచి వసూలు చేసేందుకు కుయుక్తులు పన్నిందా.. అంటే అవుననే సమాధానం వస్తోంది. దాదాపు దశాబ్దకాలం క్రితం రైతులకిచ్చిన వడ్డీ రాయితీ సొమ్మును ఇప్పుడు సహకార సంఘాలు కట్టాలని ఉత్తర్వులు జారీ చేయడంపై సంఘాల కార్యదర్శులు, పాలక కమిటీలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

డిసిసిబి (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు)కు ఉమ్మడి జిల్లాలో 34 బ్రాంచీలు ఉన్నాయి. వీటి పరిధిలో 258 సహకార సంఘాలు ఉన్నాయి. సహకార సంఘాలనేవి రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు ఏర్పడినవి. సహకార సంఘాల్లో రెండు రకాల రుణాలిస్తారు. పంట రుణాలు వంటి షార్టటర్మ్ రుణాలు, గేదెలు, గొర్రెలు, వాహనాలకు సంబంధించిన లాంగ్‌టర్మ్ రుణాలను రైతులకు అందిస్తారు. లాంగ్‌టర్మ్ రుణాలకు 11.15 శాతం నుంచి 15 శాతం వరకూ వడ్డీ ఉంటుంది. 2014 ముందు వరకూ సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు వడ్డీరాయితీ కింద ఆరు శాతం ప్రభుత్వం ఇచ్చేది. ఉమ్మడి భాగంగానే జిల్లాలోని సహకార సంఘాలకు 2010-11లో రూ.4,36,85,983 కోట్లు, 2011-12కు సంబంధించి రూ.10,34,83,734 కోట్లు, 2012-13లో రూ.12,80,11,692 కోట్లు మొత్తం రూ.27,51,81,409 కోట్లు జిల్లా రైతులకు వడ్డీ రాయితీ వర్తించింది. ఈ సొమ్మును డిసిసిబి తమ పరిధిలోని సహకార సంఘాల్లోని రైతులకు వడ్డీరాయితీ సొమ్ము చెల్లించడం సైతం జరిగింది. ఇది జరిగి దాదాపు 12 ఏళ్లు కావొస్తోంది. రైతులకు తామిచ్చిన వడ్డీ రాయితీ సొమ్ము ప్రభుత్వం నుంచి రాలేదు. అందువల్ల రూ.27.51 కోట్ల సొమ్మును సహకార సంఘాలు చెల్లించాలని గత నెల 29వ తేదీన డిసిసిబి సహకార సంఘాలకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సహకార సంఘాల కార్యదర్శులు, పాలకవర్గ కమిటీలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. పదేళ్ల క్రితం రైతులకిచ్చిన వడ్డీ రాయితీ సొమ్ము ఏవిధంగా సహకార సంఘాలు చెల్లిస్తాయని, అప్పట్లో వడ్డీ రాయితీ తీసుకున్న రైతులు ఇప్పుడు చాలామంది సహకార సంఘాల్లో సభ్యులుగా కూడా లేరని చెబుతున్నారు. డిసిసిబి బ్యాంకు మరో కొత్త ఎత్తుగడ వేసి ఈ సొమ్మును రాబట్టేందుకు ప్రయత్నిస్తోంది. సహకార సంఘాలకు అప్పుగా ఇస్తామని, తిరిగి చెల్లించాలని చెబుతోంది. సహకార సంఘాలు డిసిసిబి నుంచి అప్పుగా సొమ్ము తీసుకుంటే ఆ సొమ్మును రైతులకు ఇవ్వాల్సి ఉంటుంది. మళ్లీ రైతుల నుంచి వసూలు కట్టాలి. ఇప్పుడు అప్పుగా ఇచ్చే సొమ్మును రైతులకు ఇవ్వకుండా డిసిసిబికి ఇస్తే ఆడిట్‌లో ఏవిధంగా చూపించాలని సహకార సంఘాల కార్యదర్శులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా చేస్తే సంఘం మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని భయం అందరినీ వెంటాడుతోంది. పదేళ్ల తర్వాత వడ్డీరాయితీ సొమ్ము వెనక్కి తీసుకునేందుకు పూనుకోవడం వెనుక పెద్ద కుట్ర ఉన్నట్లు తెలుస్తోంది. వడ్డీ రాయితీ కింద సొమ్ము కట్టాల్సి వస్తే ప్రతి సహకార సంఘం రూ.లక్షల్లో చెల్లించాల్సి ఉంది. మచ్చుకు పరిశీలిస్తే ఆకివీడు మండలంలో ఐదు సహకార సంఘాలున్నాయి. వీటిలో వడ్డీరాయితీ కింద ఆకివీడు సంఘానికి రూ.5.56 లక్షలు, ఉండి సంఘానికి రూ.3.56 లక్షలు, పెదపుల్లేరుకు రూ.20 వేలు, చెరుకుమిల్లి సంఘానికి రూ.79 వేలు, కలవపూడి సంఘానికి రూ.47 వేలు ఇలా మొత్తం మండలంలోని సహకార సంఘాలు రూ.10.61 లక్షలు వరకూ చెల్లించాల్సి ఉంది. పెద్ద సహకార సంఘాలు మరింత ఎక్కువగా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

అవినీతి ఆరోపణల వెల్లువ.. క్యాష్ రేషియో 6.25 శాతానికి పతనం

జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పరిధిలో 34 బ్రాంచీలు ఉండగా గోపాలపురం, చాగల్లు వంటి బ్రాంచీల్లో నకిలీ బంగారం తాకట్టు వ్యవహారంతో పెద్దఎత్తున అవినీతి జరిగింది. నిడదవోలు, పాలకొల్లు, యలమంచిలి, పెనుగొండ, తాడేపల్లిగూడెం బజార్ వంటి బ్రాంచీల్లో బ్యాంకు గ్యారెంటీలతో చేసిన అప్పుల మంజూరులో పెద్దఎత్తున అవినీతి సాగినట్లు బయటపడింది. మిగిలిన బ్రాంచీల్లో పరిస్థితి ఏమిటో ఇంకా తెలియాల్సి ఉంది. బయటపడిన లెక్కల ప్రకారం దాదాపు రూ.150 కోట్లు మేర డిసిసిబి బ్రాంచీల్లో అవినీతి జరిగినట్లు పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. డిసిసిబిలో అవినీతి పరాకాష్టకు చేరడంతో బ్యాంక్ క్యాష్‌రేషియో పడిపోయినట్లు తెలుస్తోంది. జిల్లా సహకార కేంద్రబ్యాంక్‌కు వర్కింగ్ క్యాపిటల్, షేర్ క్యాపిటల్, రిజర్వుడు నిధులు, సెంట్రల్ బ్యాంకు నుంచి తీసుకున్న అప్పులు వంటివన్నీ కలిపి బ్యాంక్ క్యాష్ రేషియోగా లెక్కిస్తారు. ఈ క్యాష్ రేషియో తొమ్మిది శాతం ఉండాల్సి ఉండగా అవినీతి వ్యహహారాలతో 6.25 శాతానికి పడిపోయినట్లు తెలుస్తోంది. క్యాష్ రేషియో పడిపోవడంతో డిసిసిబికి నాబార్డు నుంచి వచ్చే నిధులకు అంతరాయం ఏర్పడనుంది. దీంతో డిసిసిబికి తీవ్ర ఇబ్బందులు వచ్చిపడతాయి. ప్రభుత్వం నుంచి ఒత్తిడి తెచ్చి వడ్డీరాయితీ నిధులు తీసుకోవాల్సి ఉండగా అది వదిలేసి సంఘాలను దెబ్బతీసే విధంగా డిసిసిబి ముందుకు సాగుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీనిపై వెంటనే ఉన్నతాధికారులు, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, లేకపోతే సహకార సంఘాలకు తీవ్ర ఇబ్బందులు తప్పవని అంతా అభిప్రాయపడుతున్నారు.

చెప్పాల్సిన అవసరం లేదు

బి.శ్రీదేవి, సిఇఒ, డిసిసిబి

వడ్డీ రాయితీ సహకార సంఘాల నుంచి వసూలు చేయడంపై డిసిసిబి సిఇఒ శ్రీదేవిని ప్రజాశక్తి వివరణ కోరగా చెప్పాల్సిన అవసరం లేదని, మీకు ఎవరు చెప్పారో వాళ్లనే అడగాలంటూ సమాధానమిచ్చారు.

సహకార సంఘాల కార్యదర్శుల నుంచి వెల్లువెత్తుతున్న ప్రశ్నలు

-2013 మధ్యకాలంలో డిసిసిబి ఇచ్చిన వడ్డీరాయితీ సొమ్ము రైతులకు వెళ్లిపోయింది. సంఘం వద్ద లేదు. అంత సొమ్మును రుణంగా తీసుకుంటే ఎవరికి చెల్లించినట్లు చూపాలి. రైతులకు ఇవ్వకుండా మన దగ్గర ఉన్నట్లు చూపితే డిపార్టుమెంట్ ఆడిటర్లు ఒప్పుకుంటారా?

-2013లో లావాదేవీలకు సంబంధించి ఆడిట్ ప్రక్రియ పూర్తయింది. వాటిని ఎలా మార్చగలం. వాటికి ఆడిటర్లు ఒప్పుకుంటారా, అడిటర్లు ఒప్పుకోకపోతే డిపార్టుమెంట్ కార్యదర్శులపై చర్యలు తీసుకునే అవకాశం లేదా.. అప్పుడు ఏం చేయాలి. బ్యాంకు మనల్ని ఏ విధంగా కాపాడుతుంది?

-జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వడ్డీ రాయితీని వెనక్కి తీసుకోవాలనే విషయాలకు సంబంధించి డిపార్టుమెంట్ నుంచిగానీ, ఆప్కాబ్ లేదా నాబార్డు వారి నుంచి అనుమతులున్నాయా?

-ఆడిట్ జరిగిన అక్కౌంట్స్‌ను ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్టుమెంట్‌కు సమర్పించడం జరిగింది. ఇప్పుడు వారు ఒప్పుకుంటారా, ఒప్పుకోకపోతే డిపార్ట్‌మెంట్ నుంచి ఏవిధమైన చర్యలుంటాయి. అప్పుడు కార్యదర్శుల పరిస్థితి ఏమిటి?

-అడ్వాన్స్ షేర్ క్యాపిటల్ చెల్లించమంటున్నారు. మనం కట్టిన షేర్ క్యాపిటల్‌కే వారు వడ్డీ ఇవ్వట్లేదు. రిజిస్టర్ ఉత్తర్వులున్నా, సంఘ సభ్యుడు ఎవరైనా లోన్ క్లియర్ చేసినట్లయితే మనం వారికి షేర్ క్యాపిటల్ అడ్జెస్ట్ చేస్తున్నాం. అయితే సెంట్రల్ బ్యాంక్ మాత్రం మనం కట్టిన షేర్ క్యాపిటల్ తిరిగివ్వడం లేదు. ఇటువంటప్పుడు మన అడ్వాన్స్ షేర్ క్యాపిటల్ చేస్తే సంఘం వడ్డీ నష్టపోదా.. మనం అడ్వాన్స్ షేర్ క్యాపిటల్ చేస్తే దానికి తగ్గట్లు లోన్ ఇస్తారని నమ్మకం ఏమిటి? అంత లోన్ తీసుకోవడానికి మన దగ్గర సభ్యులుండాలి కదా? లోన్ మంజూరు ఆర్డర్ లేకుండా మీరు అంత షేర్ క్యాపిటల్ ఎందుకు కట్టారని డిపార్టుమెంట్ ఆడిటర్ అడిగితే ఏం సమాధానం చెప్పాలంటూ కార్యదర్శులు ప్రశ్నలు సంధిస్తున్నారు.

గందరగోళం..!

ఫిజిక్స్, ఎన్ఎస్ పరీక్షపై పదో తరగతి విద్యార్థుల ఆందోళన

ఒక పేపర్ రాశాకే.. రెండో పేపర్ రాస్తేనే మేలంటున్న ఉపాధ్యాయులు

ప్రతి 15 నిమిషాలకోసారి గుర్తు చేయాలనే ఆదేశం అమలయ్యేనా!

ప్రజాశక్తి - భీమవరం

పదో తరగతి విద్యార్థులను ఫిజిక్స్, ఎన్ఎస్ పరీక్షపై గందరగోళం, ఆందోళన నెలకొంది. ఈ పరీక్ష నిర్వహణపై అటు ఉపాధ్యాయుల్లోనూ, ఇటు విద్యార్థుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక పేపర్ రాశాకే రెండో పేపర్ రాస్తే ఉపయోగకరమని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో ఈ సబ్జెక్టులో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిలయ్యే ప్రమాదం ఉందని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రతి 15 నిమిషాలకోసారి విద్యార్థులకు దీనిపై గుర్తు చేయాలని ఇన్విజిలేటర్లకు విద్యాశాఖ నుంచి ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలొచ్చాయి. అయితే ఇది ఎంతవరకు అమలవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

గతేడాది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరిగాయి. ఈ ఏడాది నూతన విభజిత జిల్లాలో పరీక్షలు ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు 376 ఉన్నాయి. అధికారులు 121 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 24,586 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి 121 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 121 మంది డిపార్టుమెంటల్ అధికారులు, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 24 మంది రూట్ అధికారులను నియమించారు.

పదో తరగతి పరీక్షల్లో గతేడాది ఏడు పేపర్లు పెట్టగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో వాటిని ఆరింటికే కుదించి పరీక్షలు నిర్వహించేలా మార్పులు తీసుకొచ్చారు. ఈ ఏడాది ఫిజిక్స్, నేచురల్ సైన్స్ (ఎన్ఎస్)కు వేర్వేరుగా ప్రశ్నపత్రాలు, వేర్వేరుగా ఆన్సర్ బుక్‌లెట్లు ఇస్తారు. దీనిపైనే ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. ఈ పరీక్షకు సంబంధించి ఇప్పటికే నిర్వహించిన ప్రీ పబ్లిక్ పరీక్షలో ప్రాక్టీస్ చేయించినా చాలా స్కూళ్లల్లో విద్యార్థులు ఫిజిక్స్ ఆన్సర్ బుక్‌లెట్‌లో ఎన్ఎస్ ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు రాశారు. పబ్లిక్ పరీక్షలో ఇదే పునరావృతమైతే అంతిమంగా విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. రెండు ప్రశ్నాపత్రాలు, రెండు ఆన్సర్ బుక్‌లెట్లు ఒకేసారి ఇస్తారు. దీంతో విద్యార్థులు వారికి ఏ పేపర్ తేలిగ్గా ఉందో, దాన్ని ముందుగా రాసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే జవాబులు వేర్వేరు ఆన్సర్‌షీట్లపై రాయాల్సి ఉంది. దీంతో వాటిని రాసే క్రమంలో పొరపాటున ఒక దానిపై రాయాల్సింది మరోదానిపై రాస్తే విద్యార్థులకు నష్టం జరుగుతుందని, వేర్వేరుగా కాకుండా ఒకే ఆన్సర్ బుక్‌లెట్‌లో సమాధానాలు రాసేలా వెసులుబాటు కల్పించాలని ఇప్పటికే ఉపాధ్యాయులు పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే వారి నుంచి ఎటువంటి స్పందనా లేదు. పిల్లలకు ఈ నూతన విధానం అలవాటు కావాలని, ఎన్ఇసిఆర్‌టి పరీక్షలు రాసేవారు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ మూడు పేపర్లు విడివిడిగా రాస్తారని, కనీసం మన విద్యార్థులు రెండు పేపర్లయినా రాయకపోతే ఎలా అని చెప్పి పాఠశాల విద్యాశాఖాధికారులు వాదిస్తున్నారు.

సీరియల్ నెంబరు వేర్వేరుగానే..

సీరియల్ నెంబరు ఒకటి నుంచి 16 వరకు ఫిజిక్స్, 17 నుంచి 33వ ప్రశ్న వరకూ ఎన్ఎస్ సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. పొరపాటున 17వ నంబరు ప్రశ్నకు ఫిజిక్స్ సమాధాన పత్రంలో రాస్తే ఆ మేరకు ఇన్వాలిడ్‌గా పరిగణిస్తారు. ఇది లేకుండా ఉండాలంటే 1 నుంచి 16 దాకా ఫిజిక్స్ ప్రశ్నావళికి ఆ ఆన్సర్ బుక్లెట్‌పైనే రాయాలి. ఎన్ఎస్‌కు కేటాయించిన 17 నుంచి 33 నెంబర్లు వరకూ సంబంధిత ఆన్సర్ షీట్‌పై సమాధానాలు రాయాల్సి ఉంటుంది. అయితే విద్యార్థులు పరీక్ష రాసే సమయంలో తడబడి ఒకదాని బదులు మరో ఆన్సర్ షీట్‌లో సమాధానాలు రాస్తే ఆయా సబ్జెక్టుల్లో ఫెయిలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

విద్యాశాఖ ఆదేశాలు అమలయ్యేనా

ప్రతి 15 నిమిషాలకు ఒకసారి విద్యార్థులకు ఇన్విజిలేటర్లు గుర్తు చేస్తూ అప్రమత్తం చేసేలా విద్యాశాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈ విషయాన్ని ప్రతి పరీక్ష గదిలో బోర్డుపై సైతం రాయాలని సూచించారు. తాము ఎంత ప్రాక్టీస్ చేయించినా ఇప్పటికీ చాలా మంది విద్యార్థులు పాఠశాల స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లోనే అయోమయానికి గురై ఒకే బుక్‌లెట్‌పై ఫిజిక్స్, ఎన్ఎస్‌కు సమాధానాలు రాశారని పలువురు హెచ్ఎంలు తెలిపారు. పరీక్ష ఒకే రోజు పెడుతున్నప్పుడు ఆన్సర్ షీట్ సైతం రెండింటికి కలిపి ఒకటే ఇచ్చి రాయమంటే బాగుండేదని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో విద్యాశాఖ ఆదేశాలు ఎలా అమలవుతాయి, ఫలితాలు ఎలా రానున్నాయనే దానిపై సర్వత్రా ఆందోళన నెలకొంది.

విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

ఫిజిక్స్, ఎన్ఎస్ పరీక్ష నిర్వహణలో విద్యాశాఖ తీసుకొచ్చిన నూతన విధానంతో ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది రెండు పేపర్లుగా విభజించి, ఈ ఏడాదేమో ఒకే రోజు పరీక్షను నిర్వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండు బుక్‌లెట్ల చొప్పున 24 పేజీలు వేర్వేరుగా ఇచ్చినప్పటికీ ఒకదానికి సంబంధించిన ఆన్సర్ వేరొక బుక్‌లెట్‌లో రాసే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ఒక పేపర్ రాసిన తర్వాత రెండో పేపర్ రాసుకోవాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

1న జీతాలేవీ

కలెక్టరేట్ ఉద్యోగుల ఆవేదన - 24వ రోజు కొనసాగిన నిరసన

ప్రజాశక్తి - భీమవరం



నినదిస్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు

తమ న్యాయమైన సమస్యలు వరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని, కనీసం ఒకటో తేదీ వచ్చినా జీతాలు అందించకపోవడం దారుణమని భీమవరం కలెక్టరేట్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా భీమవరం కలెక్టరేట్ ఉద్యోగులు చేపట్టిన నిరసన 24వ రోజు శనివారం కూడా కొనసాగింది. దీనిలో భాగంగా ఉద్యోగులు ఐదు గంటలకు విధులు ముగించి కలెక్టరేట్ ఎదురుగా నిరసన తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగులకు ఈ నెల కూడా జీతాలు ఒకటో తేదీన అందించకపోవడం దుర్మార్గమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 5న రాష్ట్ర నాయకత్వం ప్రకటించే కార్యాచరణను జిల్లాలో కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి వై.దుర్గాకిషోర్, సూపరింటెండెంట్ ఎస్.సుబ్రహ్మణ్యం, సిహెచ్.రవికుమార్, నిజాముద్దీన్‌షా, సీనియర్ సహాయకులు వివి.పెద్దిరాజు, పి.జగన్మోహన్, కె.కళ్యాణి, పి.గౌతమి, పివి.సాంబశివరావు, కె.సురేష్, డిటి సూర్యనారాయణరాజు, జూనియర్ సహాయకులు సాయి, పద్మ, జీవన్, రమ, సురేష్ సిబ్బంది బుజ్జియ్య, సూర్యకాంతం, అనురాధ, మురళీ, సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

సరికొత్త హంగులతో మలబార్ గోల్డ్ పునఃప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్



ఆభరణాలు అందిస్తున్న ఛైర్మన్

అతిపెద్ద బంగారు, వజ్రాభరణల షోరూమ్‌ల్లో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ భీమవరం జెపి రోడ్డులో సరికొత్త హంగులతో ముస్తాబైంది. ఈ షోరూమ్‌ను శనివారం శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలబార్ అంటే ఒక పండుగ అని, బంగారు, వజ్రాలు, ప్లాటినం, రత్నాభరణాలు, వెండి ఆభరణాలు, సాంప్రదాయ ఆభరణాలు రోజువారీ ధరించే ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. మలబార్ విజయవాడ స్టోర్ హెడ్ నిఖిల్ చంద్రన్, భీమవరం స్టోర్ హెడ్ అర్జున్, ఇంతియాజ్ మాట్లాడుతూ వెరైటీ డిజైన్లతోపాటు 4.9 శాతం నుండి ప్రారంభమయ్యే తరుగు ఛార్జీలతో విస్తృత శ్రేణిలో ఆభరణాలు లభిస్తున్నాయని తెలిపారు. డైమండ్, జెమ్ స్టోన్, పోల్కీ డిజైన్ల ఆభరణాల కొనుగోలుపై 250 మిల్లీగ్రాముల బంగారు నాణేనికి సమానమైన విలువను పొందవచ్చునని, ఈ నెల 23 వరకు ఈ ఆఫర్ వర్తిస్తుందని అన్నారు. మలబార్ గ్రూప్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఐదు శాతం మొత్తాన్ని దాతృత్వ కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నామన్నారు. స్టోర్ మేనేజర్లు కృష్ణ, నరసింహ, గూడూరి ఉమాబాల, సంజన డెవలపర్స్ జానీ, దాయన చంద్రాజీ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

ప్రజాశక్తి - పాలకోడేరు

పేదల ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పాలకోడేరులోని జగనన్న లేఅవుట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. లేఅవుట్‌లో 235 ఇళ్లకుగాను 18 ఇళ్లే పూర్తయ్యి, మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరుకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలు, అర్బన్ లేఅవుట్లల్లో మౌలిక వసతుల కల్పన త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం వచ్చిన సమస్యలను వెంటనే పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట గృహనిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి పీడీ బి.పిచ్చియ్య, ప్రత్యేకాధికారి బి.రమణ, తహశీల్దారు షేక్ హుస్సేన్, ఎంపిడిఒ ఎంఎస్.గంగాధర్‌రావు, డిఇఇ పి.శివరామరాజు, ఎఇ బివి.నర సింహారావు, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోడ్లు వేస్తాం.. ఇళ్లు నిర్మించుకోండి: కలెక్టర్

వీరవాసరం: బాలేపల్లిలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకొస్తే రోడ్లు వేస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి లబ్ధిదారులకు తెలిపారు. జగనన్న లేఅవుట్‌ల పరిశీలనలో భాగంగా శనివారం ఆమె బాలేపల్లిలో లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ లేఅవుట్‌లో 146 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఈ లేఅవుట్ బాలేపల్లికి మరో కిలోమీటరు దూరంలో ఉంది. ఈ లేఅవుట్‌లోనే ఐదు కిలోమీటరు దూరంలో ఉన్న వీరవాసరానికి చెందిన వంద మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారు. దీంతో ఉపాధి దొరుకుతున్న వీరవాసరంలో కాకుండా దూరంగా ఉన్న బాలేపల్లి లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు విముఖత చూపుతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఈ లేఅవుట్ పరిశీలనకు రావడం ప్రాధాన్యత ఏర్పడింది. ఈ లేఅవుట్‌కు దగ్గరగా ఉన్న మూడు గ్రామాలకు చెందిన కేవలం 25 మంది మాత్రమే ఇక్కడ ఇళ్ల నిర్మాణానికి ముందుకొచ్చినట్లు తెలుస్తోంది. ఈ 25 మంది కోసం రూ.20 లక్షలతో రోడ్డు అభివృద్ధి చేస్తారా అనేది ప్రశ్నార్థకంగా ఉంది. వీరవాసరం లబ్ధిదారులు చెబుతున్న అభ్యంతరాలను మండల అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లకుండా మౌనం వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో లబ్ధిదారులకు ఉపాధి దొరికే ప్రాంతంలోనే ఇళ్ల స్థలాలు ఇస్తారా, లేక అధికారులు చెప్పిన చోటే ఇళ్లు నిర్మించుకోవాలని స్పష్టం చేస్తారా అనేది వేచిచూడాలి.

ఎంంసిలోకి కలెక్టరేట్

జిఒ విడుదల

సిఎం జగన్‌కు ఎంఎల్ఎ గ్రంధి కృతజ్ఞతలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్



గ్రంధికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు, నేతలు

ప్రజలకు అందుబాటులో ఉండేలా జిల్లా కలెక్టరేట్‌ను మార్కెట్ యార్డులోకి తరలించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన జిఒ విడుదలైందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో భాగంగా నూతనంగా పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడటం, జిల్లా కేంద్రంగా భీమవరంను ఎంపిక చేయడంతో తాను జీవితాంతం సిఎం జగన్‌కు రుణపడి ఉంటానన్నారు. ఒకానొక దశలో జిల్లా కేంద్రం భీమవరానికి ఇవ్వకపోతే ప్రజల ఆకాంక్షలు నెరవేరవని, తాను ఎంఎల్ఎ పదవికి రాజీనామా చేసేందుకు వెనుకాడనని స్పష్టం చేశానన్నారు. ఈ నెల 4న జిల్లా ఆవిర్భావ దినోత్సవం భీమవరం కేంద్రంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తామని, అదేరోజు తాడేరు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. త్వరలోనే మార్కెట్ యార్డ్‌కు కలెక్టరేట్ మారుతుందన్నారు. తొలుత పలువురు అధికారులు ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయనరసింహారాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, తహశీల్దార్ వై.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, ఎంపిడిఒలు రామచంద్రప్రభు, ఉమామహేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ గ్రంధి పవన్, వైసిపి నేతలు తోట భోగయ్య, నల్లం రాంబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు, కోమటి రాంబాబు, మానుకొండ ప్రదీప్ గూడూరి ఓంకార్. కొల్లి ప్రసాద్, నూకల కనకారావు పాల్గొన్నారు.

యర్రా కుటుంబానికి పలువురు పరామర్శ

ప్రజాశక్తి - ఉండి



ఎంఎల్ఎ రామరాజు, ఎంఎల్సి సత్యనారాయణరాజు పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎంఎల్సి అంగర రామ్మోహన్, నేతలు

ఇటీవల మృతి చెందిన మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు యర్రా నారాయణస్వామి కుటుంబాన్ని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, ఎంఎల్సి మంతెన వెంకట సత్యనారాయణరాజు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామరాజు, సత్యనారాయణరాజు మాట్లాడుతూ యర్రా నారాయణస్వామి రాజకీయాల్లో అజాతశత్రువు అని, పార్టీలకతీతంగా ప్రతిఒక్కరితోనూ ఎంతో సౌమ్యంగా ఉండేవారని అన్నారు. ఆయన మృతి పార్టీకి, తీరనిలోటు అని నారాయణస్వామి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, ఉపాధ్యక్షులు పేరిచర్ల కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షులు లోకం సుబ్బారావు, టిడిపి సీనియర్ నాయకులు జుత్తిగ శ్రీనివాస్, యర్రా చిట్టిబాబు, చెన్నంశెట్టి హరినాయుడు ఉన్నారు.

పాలకొల్లు: రాజ్యసభ మాజీ సభ్యులు యర్రా నారాయణస్వామి కుటుంబ సభ్యులను ఎంఎల్సి అంగర రామ్మోహన్ శనివారం పరామర్శించారు. ఉండి మండలం ఉప్పులూరులోని ఆయన స్వగృహానికి వెళ్లిన రామ్మోహన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఎంఎల్ఎ, ఎంపీ, జెడ్‌పి ఛైర్మన్‌గా పని చేసి జిల్లా అభివృద్ధికి నారాయణస్వామి ఎనలేని కృషి చేశారని, ఆయన మరణం జిల్లాకు తీరని లోటు అని అన్నారు. ఆయన వెంట వీరవల్లి చంద్రశేఖర్, గూడవల్లి తాతయ్య ఉన్నారు.

రాజకీయ దురంధరుడు నారాయణస్వామి

భీమవరం రూరల్: రాజకీయ దురంధరులు, మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి మృతి తీరనిలోటని పలువురు వక్తలు అన్నారు. శనివారం శ్రీ విజ్ఞాన వేదిక, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో క్విట్ ఇండియా స్తూపం వద్ద యర్రా నారాయణస్వామి సంతాప సభ నిర్వహించారు. వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ క్రమశిక్షణాయుతమైన రాజకీయాలకు పునాది నారాయణస్వామి అని, చేపట్టిన అన్ని పదవులకూ సంపూర్ణ న్యాయం చేసిన యర్రా మరణం తీరని లోటని అన్నారు. జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్‌రాజు, చిన్మయప్రభ అధ్యక్షులు బొండా వెంకట సుబ్బారావు, లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు కంతేటి వెంకట రాజు, అరసవల్లి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ అరసవల్లి సుబ్రహ్మణ్యం, న్యాయవాది ఉండపల్లి రమేష్‌నాయుడు మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతం కోసమే రాజకీయాల్లో చాకచాక్యంతో వ్యవహరించిన మహోన్నత వ్యక్తి నారాయణస్వామి అని కొనియాడారు.

విశాఖ ఉక్కు పోరుకు మద్దతుగా ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విశాఖఉక్కు ప్రయివేటీకరణ ప్రతిపాదనను విరమించుకోని పక్షంలో ప్రజాపోరాటాన్ని ఉధృతం చేస్తామని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటం మొదలై 700 రోజులకు చేరుకున్న సందర్భంగా శనివారం స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ రాష్ట్రప్రజల త్యాగాలు, పోరాటాలతో ముడిపడిన విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రయివేటుపరం చేయాలని చూడటం ప్రజల మనోభావాలు, ప్రయోజనాలను దెబ్బతీయడమేనన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కళింగ లక్ష్మణరావు, భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు, మాట్లాడారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సిఎం లక్ష్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఆచంట

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ముఖ్యమంత్రి లక్ష్యమని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. రామేశ్వరస్వామి సన్నిధిలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు అధ్యక్షతన వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కును ఆయన శనివారం డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగనాథరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. మండలంలోని 1252 డ్వాక్రా రూ 12 కోట్ల, 18 లక్షల 85 వేల 990 అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్పర్సన్ రావు లావణ్య, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, సర్పంచులు పాల్గొన్నారు.

తణుకు : మహిళల ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చాలనే ఉద్దేశంతో సిఎం మహిళా పేరిట అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలోని వాయిస్ హైస్కూల్లో మూడో విడత వైఎస్ఆర్ సంబంధించి రూ.ఐదు కోట్ల 71 లక్షల చెక్కును మంత్రి మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు బ్యాంకుల నుండి తీసుకున్న డ్వాక్రా రుణాలు కూడా వడ్డీ మాఫీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి వంకా రవీంద్రనాథ్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జెసిఎస్ కన్వీనర్లు కృషి చేయాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి కుటుంబమూ కూడా ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో నవరత్నాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యానికి పెద్ద పీట వేశామన్నారు. తాడేరు వంతెన నిర్మాణానికి రూ.2.30 కోట్ల నిధులను మంజూరు చేయించి టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈనెల నాలుగో తేదీన శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, వీరవాసరం మండల కన్వీనర్ గూడూరి ఓంకార్ పాల్గొన్నారు.

మట్టపర్రులో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పోడూరు

మట్టపర్రు గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శనివారం ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో టిడిపి హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయనీ, నాలుగేళ్లుగా ఎటువంటి సంక్షేమ కార్యక్రమమూ జరగలేదని తెలిపారు. ధరలు పెరిగిపోవడంతో ప్రజల ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, సర్పంచి దొమ్మేటి శ్రీనివాస్, ఎస్సి సెల్ అధ్యక్షులు యేళ్లమెల్లి వెంకటరావు, మాజీ జెడ్పిటిసి బొక్క నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'నిరుద్యోగులకు ప్రభుత్వం మొండిచేయి'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జగన్ పాదయాత్రలో తాను అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాలను ఏటా జాబ్ కాలండర్ ద్వారా భర్తీ చేస్తానని చెప్పి రాష్ట్రంలో నిరుద్యోగులను మోసం చేశారని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి విమర్శించారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయం నుంచి ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వోద్యోగాల నోటిఫికేషన్ లేక రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాక యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. ఉపాధి ఉద్యోగాల్లేక రాష్ట్రంలో గత మూడేళ్లలో 21,575 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి చెప్పడం వాస్తవం కాదా తెలిపారు. చంద్రబాబు హయాంలో రెండు సార్లు డిఎస్సి నిర్వహించి 18 వేల ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ప్రతినెలా 6 లక్షల మంది నిరుద్యోగ యువతకు రూ.2000 చొప్పున నిరుద్యోగ భృతి ఇచ్చారని తెలిపారు. జగన్ అసమర్థ పాలనతో యువతను మోసం చేయడం మాని వెంటనే ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

నత్తారామేశ్వరంలో శ్రమదాన శిబిరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

నత్తారామేశ్వరంలో శ్రమదాన శిబిరం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి వెలగల ధర్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి దూలం కిషోర్ మాట్లాడుతూ గ్రామంలో శ్రమదాన్ శిబిర్ వర్క్ క్యాంప్‌ను మూడు రోజుల పాటు జరుగుతుందన్నారు. ఈ మూడు రోజులూ సుమారు 40 మంది యువత పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్లు సానబోయిన ఝాన్సీ ప్రసన్న, జక్కంశెట్టి దుర్గాప్రసాద్, ఓసూరి కుసుమారత్నం పాల్గొన్నారు.

పది పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - కాళ్ల

పది పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎంపిడిఒ జి.స్వాతి, తహశీల్దార్ టిఎ కృష్ణారావు పదో తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం పరిశీలించారు. కోపల్లె, కాళ్ల, ఏలూరుపాడు, కలవపూడి హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాలను పరిశీలించి ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. బెంచీలు, తాగునీటి వసతులను పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు గాదిరాజు వెంకట రామకృష్ణంరాజు, కె.సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆచంట : ఈ నెల 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు తహశీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కొడమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జగన్నాథరావు గ్రామ సర్పంచి సుంకర సీతారామ్, విఆర్ఒలు మిరియాల శేషగిరి, కలిదిండి నర్సింహరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు: పది పరీక్షా కేంద్రాల వద్ద పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ ఆర్సి ఆనంద్‌కుమార్ ఆయా పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని మొగల్తూరు, శేరేపాలెం, ముత్యాలపల్లి, జగన్నాథపురం, కెపిపాలెంలో పరీక్షలు జరగనున్నాయని తెలిపారు.

నాక్ గుర్తింపునకు సిబ్బంది కృషి అవసరం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలను రెండవ జోన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పివి కృష్ణాజీ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాల మంచి నాక్ గ్రేడ్ సాధించడానికి అందరూ ప్రయత్నించాలన్నారు. రికార్డులు అన్నీ సిద్ధం చేసుకోవాలని కోరారు. కళాశాలలో నాక్ బ్యూటిఫికేషన్‌లో భాగంగా పెయింటింగ్ వర్క్స్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి, సూపరింటెండెంట్ పతాంజలి, అధ్యాపక, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మోడీ వైఖరికి నిరసనగా కాంగ్రెస్ నిరాహార దీక్ష

ప్రజాశక్తి - పాలకొల్లు

దేశంలో సంపదనంతటినీ అదాని వంటి వారికి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ రాహుల్ జోడో యాత్ర నిర్వహించారని, దీనికి మంచి స్పందన రావడంతో ప్రధాని మోడీ కక్షగట్టి ఎంపీగా అనర్హత వేటు వేయించారని రాష్ట్ర కాంగ్రెస్ కన్వీనర్ కొలుకులూరి అర్జునరావు చెప్పారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మోడీ వైఖరికి నిరసనగా ఒక రోజు నిరాహారదీక్ష చేపట్టారు. నాలుగేళ్లుగా మోడీ గ్యాస్ సిలిండర్ ధర రూ.450 నుంచి రూ.1150లకు పెంచిందన్నారు. నిలదీస్తున్న రాహుల్‌ను ఎంపీ సభ్యత్వం రద్దు చేశారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వర్ధినీడి బాబ్జి, ముహమ్మద్ జానీ, బోనం వెంకట్రావు పాల్గొన్నారు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

సిపిఎం సీనియర్ నేత ఆనందరావు మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - వీరవాసరం

సిపిఎం సీనియర్ నేత నేతల ఆనందరావు మృతి ఉద్యమానికి తీరని లోటు అని పలువురు సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. నేతల ఆనందరావు మృతదేహాన్ని పలువురు సిపిఎం, ప్రజా సంఘాల నేతలు శనివారం సందర్శించి ఆయన భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ఆనందరావుతో ఉన్న సాన్నిహిత్యాన్ని, ప్రజా ఉద్యమంలో ఆయన పాత్రను నెమరవేసుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఆనందరావు ఉద్యమ జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. ఉద్యమాల గడ్డ మత్స్యపురిపాలెం నుండి ప్రజా సమస్యల పట్ల పరితపించే వ్యక్తి మరణం తీర్చలేనిదన్నారు. ఆయన భార్య శకుంతల వెన్నంటే ఉంటూ సారా వ్యతిరేక ఉద్యమంలో ఆమె నిర్వహించిన పాత్ర ఆదర్శనీయమన్నారు. జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ యాభై సంవత్సరాలు సిపిఎం నాయకుడుగా ఉంటూ ప్రజా ఉద్యమంలో మహోన్నత

ఆనందరావు భౌతికదేహంపై పార్టీ జెండా వేస్తున్న సిపిఎం నాయకులు

నాయకులతో కలిసి పని చేసిన నేత ఆనందరావు అన్నారు. ప్రజా సమస్యల పట్ల ఉద్యమించడంలో ఆయన ముందుండేవారన్నారు. శృంగవృక్షంలో భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కూలీల తరపున చేసిన పోరాటం ఆయన ధైర్యానికి ప్రతీక అన్నారు. వ్యవసాయ కార్మికులు హక్కుల కోసం జిల్లా స్థాయిలో చేసిన పోరాటంలో ఆయన ముఖ్యపాత్ర వహించారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘంలో ఆయన నాటిన విత్తనం నేడు మహావృక్షంగా మారిందన్నారు. వారి పోరాటం వల్ల నేడు ఉపాధి హామీ చట్టం అమలవుతోందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉద్యమాల పట్ల ఆనందరావు ప్రోత్సాహం మరువలేనిదన్నారు. కష్టకాలంలో మత్స్యపురిపాలెం అగ్రనాయకులకు షెల్టర్‌జోన్‌గా ఉండేదని, ఆ సమయంలో ఆయన భార్య, కుటుంబ సభ్యుల ఆదరణ మరువలేనిదని తెలిపారు. సిపిఎం వీరవాసరం, పాలకోడేరు మండలాల కన్వీనర్లు పోతుల మృత్యుంజయ, అగ్రియ్య, సిపిఎం నాయకులు బాలం విజయకుమార్, లింగం సత్యనారాయణ, యండమూరి సుబ్బారావు, బళ్ల చిన వీరభద్రరావు, గొట్టుముక్కల ప్రభాకరరావు, పీతల సుబ్రహ్మణ్యం, వీరవాసరం మాజీ సర్పంచి పీతల విక్టోరియా మహారాణి, వైస్ ఎంపిపి చిలకపాటి ప్రకాశం, శ్రేయాభిలాషుల పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు కసరత్తు.. ★★★

ఎం.రవీంద్ర, ఎంఇఒ, కాళ్ల

పదో తరగతి పరీక్షలు ఈనెల 3 నుంచి 18వ తేదీ వరకూ జరుగుతాయి. కరోనా వల్ల మూడేళ్లుగా పరీక్షలు సవ్యంగా జరగక విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఈ ఏడాది ఎటువంటి ఆటంకాలూ లేకుండా పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. మండలంలో కలవపూడి, కాళ్ల, కోపల్లె, బొండాడ, మాలవానితిప్ప, సీసలి, దొడ్డనపూడి, జువ్వలపాలెం, ఏలూరుపాడుకు చెందిన తొమ్మిది ప్రభుత్వ హైస్కూళ్లు, రెండు ప్రయివేటు పాఠశాలల నుంచి మొత్తం 635 మంది పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాయనున్నారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 8.45 నుంచి 9.30 వరకూ విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఒక్కనిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరు. ఈ ఏడాది ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లు మాత్రమే ఉన్నాయి.

పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి.. ★★★

వి.వినాయకుడు, ఎంఇఒ, వీరవాసరం

మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశాం. మండల వ్యాప్తంగా గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులతో కలిపి మొత్తం 1029 మంది విద్యార్థులు ఐదు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. వీరవాసరం ఎంఆర్‌కె హైస్కూల్‌తో పాటు డివైన్‌మెర్సీ, మత్స్యపురి, రాయకుదురు, కొణితివాడ హైస్కూళ్ల పది పరీక్ష కేంద్రాలుగా పరీక్షలు నిర్వహిస్తున్నాం. కొణితివాడ కేంద్రంగా కొణితివాడతో పాటు అండలూరు హైస్కూల్, పద్మాలయం హైస్కూల్ విద్యార్థులు, రాయకుదురు కేంద్రంగా రాయకుదురు విద్యార్థులతో పాటు అరట్లకట్ల విద్యార్థులు, మత్స్యపురి కేంద్రంగా మత్స్యపురి విద్యార్థులతో పాటు మల్లవరం, కొప్పర్రు విద్యార్థులు, వీరవాసరం, డివైన్‌మెర్సీ కేంద్రంగా ఆ స్కూల్స్ విద్యార్థులతో పాటు దూసనపూడి, తోలేరు, లిటిల్‌బడ్స్, భారతీ హైస్కూల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

పక్కా ప్రణాళికతో పరీక్షల నిర్వహణ.. ★★★

శ్రీనివాసరావు, ఎంఇఒ, ఆచంట

పదో తరగతి పరీక్షలకు అన్ని చర్యలూ తీసుకున్నాం. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం. ఇప్పటికే పరీక్షా పత్రాలు పోలీస్ స్టేషన్‌కు చేరాయి. పరీక్షా కేంద్రాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. వైద్య సదుపాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకున్నాం. ఉన్నతాధికారుల ఆదేశానుసారం పరీక్షలను పక్కా ప్రణాళికతో జరిగేలా ఏర్పాటు చేశాం. మండలంలోని వల్లూరు ఎంపీ పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సమసాత్మక కేంద్రంగా గుర్తించాం. ప్రతి పరీక్ష గదికీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. విద్యార్థుల సౌకర్యం నిమిత్తం తాగునీరు ఏర్పాటు చేశాం. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే హాజరు కావాలి.

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు.. ★★★

డి.సుభాకర్, ఎంఇఒ, పెనుగొండ

పదో తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేశాం. మండలంలో ఈ విద్యా సంవత్సరం 5 పరీక్షా కేంద్రాల్లో 900 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పెనుగొండ జెడ్‌పిహెచ్ స్కూల్, శ్రీచైతన్య, ఇన్ పెయింట్ జీసస్ స్కూల్, దేవ జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్, సిద్ధాంతం జెడ్‌పిహెచ్ స్కూళ్లలో పది పరీక్షలు జరగనున్నాయి. అరగంట ముందు పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తాం. విద్యార్థులు ఇబ్బంది కలగకుండా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు ఏర్పాటు చేశాం.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు.. ★★★

ఉండ్రమట్ల కనకదుర్గ,
ఆదిత్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ హెచ్ఎం, ఆకివీడు

పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించడంతోపాటు వారిలో మానసిక స్థయిర్యాన్ని నింపుతున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతత పొందేవిధంగా ప్రాణాయామం, ధ్యానం చేయిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. మా పాఠశాలలో చదువుతోపాటు విద్యార్థుల ఆరోగ్యానికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నాం. నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను చదివిస్తున్నాం.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ.. ★★★

వంశీకృష్ణ, శారద ఇంగ్లీషు మీడియం హైస్కూల్ డైరెక్టర్, ఆకివీడు

పాఠశాలలో 54 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించే దిశగా శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థుల్ని మూడు విభాగాలుగా విభజించాం. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. గత పదేళ్ల పేపర్లలో కామన్ వచ్చిన ప్రశ్నలను విద్యార్థులతో ఎక్కువ చదివిస్తున్నాం. ఈ రకంగా చదివించడం వల్ల అత్యంత తక్కువ స్థాయి మార్కులు వచ్చే విద్యార్థి సైతం పాస్ అవుతాడు. ఎక్కువ మార్కులు వచ్చేవారు మంచి ఉత్తీర్ణత సాధిస్తాడు. అదనపు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్నాం.

కలిదిండి రామచంద్రరాజు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఉండి

పెదపుల్లేరు కోపరేటివ్ సొసైటీ మాజీ ఛైర్మన్ కలిదిండి రామచంద్రరాజు (పెదపుల్లేరు రామం) మృతి గ్రామానికి, ఆయన కుటుంబానికి తీరని లోటు అని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎంఎల్ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు తెలిపారు. శనివారం ఉదయం కలిదిండి రామచంద్రరాజు మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి కొయ్యే మోషేనురాజు, మంతెన రామరాజు, పివిఎల్ నరసింహరాజు నివాళులర్పించి మాట్లాడారు. కలిదిండి రామచంద్రరాజు 1967 నుంచి రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఏనాడూ ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనకుండా తనను

కలిదిండి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మోషేనురాజు

నమ్ముకున్న వారిని విజయపథంలో నడిపించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. పెదపుల్లేరు సొసైటీ ఛైర్మన్‌గా 1980 నుంచి 85 వరకూ బాధ్యతలు నిర్వర్తించి సొసైటీని అభివృద్ధి దిశగా తీసుకెళ్లారన్నారు. మాజీ కేంద్ర మంత్రి ఉప్పలపాటి కృష్ణంరాజుతో ఉన్న సాన్నిహిత్యంతో గ్రామంలో కమ్యూనిటీ హాలు నిర్మించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. కలిదిండి రామచంద్ర రాజుకు కుమారుడు శివరామకృష్ణ నారాయణ వర్మ, కుమార్తె విజయలక్ష్మి ఉన్నారు. నివాళులర్పించిన వారిలో టిటిడి బోర్డు మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, మంతెన నరసింహరాజు, పాతపాటి శ్రీనివాస్ వర్మ, గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి రాయి రావులమ్మ, రూరల్ బ్యాంక్ ఛైర్మన్ గుల్ల అప్పన్న తదితరులు ఉన్నారు.

రహదారుల అభివృద్ధిపై దృష్టిపెట్టాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గంలో ఆర్అండ్‌బి ప్రధాన రహదారుల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి.ప్రసాదరాజు అన్నారు. శనివారం స్థానిక శాసన సభ్యులు క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి.ప్రసాదరాజు రహదారులు, భవనాల శాఖ అధికారులతో నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు - నేడులో భాగంగా ఎల్‌బి చర్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపిస్తే పనులు పూర్తిస్థాయిలో చేయకుండా అసంపూర్ణంగా చేశారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో రూ.137 కోట్ల 20 లక్షలతో 12 రోడ్ల నిర్మాణ పనులు మంజూరు కాగా వాటిలో 5 రోడ్లు నిర్మించారని, మూడింటికి టెండర్లు పిలిచారని, 4 టెండర్ల దశలో ఉన్నాయని వివరించారు. వారతిప్ప నుంచి వెంప, కొత్తపాలెం నుంచి వెంప, కెపిపాలెం నుంచి గుబ్బలవారిపాలెం, రుస్తుంబాద నుంచి మంగళగుంటపాలెం, పీచుపాలెం నుంచి దర్భరేవు రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమత్తులు చేసేందుకు సుమారు రూ.76 లక్షలు మంజూరు చేశామన్నారు. ఇంతవరకూ నరసాపురం నియోజకవర్గంలో మూడు పిహెచ్‌సిలు మాత్రమే ఉండేవని కొత్తగా మరో పిహెచ్‌సి కాళీపట్నంలో నిర్మించేందుకు రూ.240 లక్షల నిధులు మంజూరు చేసుకొని టెండర్ దశ కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బి డిఇ జివిఎస్.కిరణ్ కుమార్, ఎఇ టి.నిక్కీక్రజ్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా రాజశేఖర్

ప్రజాశక్తి - పోడూరు

యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా ఎంవి రాజశేఖర్ ఎన్నియ్యారు. శనివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్‌లో రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన ఎన్నిక ఉపాధ్యాయ ఎంఎల్‌సి సాబ్జీ అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల అలుపెరుగని పోరాటం చేస్తూ సంఘ బాధ్యతలు మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయ రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి రామభద్రం, మండల యుటిఎఫ్ నాయకులు డి.క్షేమమూర్తి, కె.నాగరాజు, పి.శ్రీనివాస్, టి.వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి - పోడూరు

కవిటం గ్రామంలో పశువులకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఎంపిపి శబ్బితి సుమంగళి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పశువులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 24వ తేదీ వరకూ జరుగుతుందని, మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తామని మండల పశు వైద్యాధికారి డాక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు ఆర్.మూర్తి, రామస్వామి, ఎహెచ్ఎలు నాగలక్ష్మి, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

సిద్ధాంతం స్కూల్లో సీసీ కెమెరాల చోరీ

ప్రజాశక్తి - పెనుగొండ

సిద్ధాంతం జెడ్‌పిహెచ్ స్కూల్లో గుర్తు తెలియని వ్యక్తులు సిసి కెమెరాలు చోరీ చేశారు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్ధాంతం జెడ్‌పిహెచ్ స్కూల్లో కొన్ని నెలలు క్రితం సీసీ కెమెరాలు అమర్చారు. శనివారం ఉపాధ్యాయులు స్కూల్‌కు వచ్చి చూసి సీసీ కెమెరాలు లేకపోవడంతో పెనుగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి కళ్యాణం

పాలకొల్లు: క్షీరా రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ దంపతులు, ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్య నారాయణ ఆధ్వర్యంలో కళ్యాణం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, గ్రామోత్సవంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ పాల్గొన్నారు.

ప్రచార యాత్రలను విజయవంతం చేయాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు

భీమవరం : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలనపై సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకూ చేపట్టబోయే ప్రచార యాత్రలు, సభలను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం భీమవరం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సిపిఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిహెచ్ రంగారావు అధ్యక్షత వహించగా నాగేశ్వరరావు మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం దేశంలో అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. విభజన హామీలు అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు పాల్గొన్నారు.

ఇంటి పన్నుపై పెన్నాడలో విచారణ

పాలకోడేరు : పెన్నాడలో ఓ ఇంటి స్థలం పన్ను విషయంలో కేంద్ర న్యాయ శాఖా మంత్రికి అందిన ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలతో పంచాయతీ విస్తరణ అధికారి వి.రెడ్డియ్య శనివారం విచారణ చేశారు. గ్రామానికి చెందిన చీరా వెంకట సత్యనారాయణ, భార్య వెంకలక్ష్మి కొంత కాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. అంధుడైన వెంకట సత్యనారాయణ పేరిట ఉన్న ఇంటి పన్నును 2021లో భార్య వెంకటలక్ష్మి తన పేర మార్పు చేయించుకున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఇరువర్గాలను విచారించి రికార్డు చేసిన వివరాల ప్రతులను ఉన్నతాధికారులకు పంపుతానని రెడ్డియ్య తెలిపారు.

వెంకన్న సన్నిధిలో ప్రజాప్రతినిధులు

పెనుమంట్ర: మార్టేరు వెంకటేశ్వరస్వామి తీర్థం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజుతో పాటు, మార్టేరు సర్పంచి మట్టా కుమారి, జెడ్‌పిటిసి కర్రి గౌరి సుభాషిణి, ఎంపిటిసి కర్రి అనురాధ, నెగ్గిపూడి ఎంపిటిసి పెనుగొండ లక్ష్మి ఉన్నారు. అలాగే మాజీ మంత్రి పితాని సత్యనారాయణ దంపతులు దర్శించుకున్నారు.

గంగిశెట్టి మృతి తీరనిలోటు

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - వీరవసరం

సిపిఐ సీనియర్ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు కడలి గంగిశెట్టి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. శనివారం నవుడూరులో ఆయన కుమారుని నివాసంలో గంగిశెట్టి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రముఖ స్వతంత్ర్య సమరయోధులు, కల్లుగీత కార్మికోద్యమ నేతల్లో గంగిశెట్టి ఒకరని అన్నారు. ఆయన మృతి కల్లుగీత ఉద్యమానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి, పీడిత ప్రజల ఉద్యమానికి తీరని లోటని అన్నారు. యువకుడిగా ఉండగా ధైర్యంగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. కల్లుగీత కార్మికోద్యమంలో ఎస్ఆర్ దాట్ల, జుత్తిగ మారియ్య, బొమ్మగాని ధర్మభిక్షం, వీరవల్లి భీమన్న వంటి వారితో జిల్లాలో, రాష్ట్రంలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంలో కృషి చేశారన్నారు. జీవితాంతం కమ్యూనిస్టు విలువలతో, ఆదర్శవంతంగా ఉన్నారన్నారు. పీడిత ప్రజల, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం పరితపించేవారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారులు కడలి మృత్యుంజయ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.రాజరామ్మోహన్ రాయ్, జె.సత్యనారాయణ పాల్గొన్నారు.

మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

రైతులు మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే బాగుంటుందని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి ఎ.దుర్గేష్ అన్నారు. శనివారం మండలంలోని రామన్నపాలెంలో తోటబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మామిడి చెటల సస్యరక్షణ చర్యల్లో భాగంగా తేనెమంచి పురుగు, తామర పురుగు, కాయ పగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారులు ప్రియదర్శిని, కె.ప్రియదర్శిని విహెచ్ఎ రాజగోపాల్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, పాలకోడేరు మండలం, శృంగవృక్షం గ్రామ సచివాలయం గ్రామానికి చెందిన జడ్డు వెంకటరంజిత్ కుమార్, తండ్రి: నాగ సాయి వెంకట సత్యనారాయణకు చెందిన విశాఖపట్నం వారు జారీ చేసిన పాస్‌పోర్టు నెం. **L5021131 ఒరిజినల్ పాస్‌పోర్టు** ది. 28-03-2023వ తేదీన శృంగవృక్షం నుండి భీమవరం పాస్‌పోర్టు జిరాక్సు తీయించుటకు మోటారు సైకిల్ మీద వెళ్ళుచుండగా మార్గ మధ్యంలో పడిపోయినది. కావున నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు సంప్రదించవలెను.

జడ్డు వెంకట రంజిత్ కుమార్
తండ్రి: నాగసాయి వెంకటసత్యనారాయణ,
శృంగవృక్షం, డో.నెం. 7-117,
రాయిచెర్వు గట్టు, పాలకోడరు మండలం.
సెల్: 79950 13339

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 666/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
VS
Pattisapu Sitalakshmi an other ***...Defendants***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) పట్టిసపు సీతాలక్ష్మి, భర్త: నాగరాజు, హిందువు, స్త్రీ, వ్యవసాయం, కంతేరు, H/o. అడవిపాలెం, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
2) పజ్జూరి రమేష్, తండ్రి: మల్లేశ్వరరావు, హిందువు, పురుషుడు, పాలకొల్లు, పాలకొల్లు JCJC.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరుగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రటకన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది.04-04-2023 వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

డి.ఎస్.వి.క్రిష్ణాజి
అడ్వకేట్, తణుకు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు తాడేపల్లిగూడెం
E.P.No. 23/2015
in O.S.N. 20/2014

బిట్వీన్:
అడబాల నాగేశ్వరరావు **...డి. హెచ్. ఆర్**
అండ్
గరగ వెంకట సుబ్బలక్ష్మి **...జె.డి. ఆర్**

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఆస్థి వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ బాకీ గాను ప్రతివాది జె.డి.ఆర్. తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి **ది.17-04-2023వ తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయితు పై కోర్టులో వేలం వేయబడును.** షరతులు తెలుసుకొని పాడవచ్చును.

షెడ్యూలు ఆస్థి

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, అప్పారావుపేట గ్రామ పరిధి, మోదుగుంట గ్రామం, తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రారులో ప్రతివాది తాలూకా ఆర్.ఎస్.నెం. 597/8, య.0-92 సెంట్లు డ్రై ల్యాండ్ యొక్క హద్దులు:
తూర్పు: గరగ చిన వెంకట్రావు గారి భూమి.
దక్షిణం: పుంత.
పడమర: కామన వెంకట్రావు గారి భూమి.
ఉత్తరం: కామన వెంకట్రావు గారి భూమి.

పై హద్దుల మధ్య య.0-92 సెంట్ల డ్రై ల్యాండ్ సమస్త పండ్ల చెట్లతో సహా.

డిక్రీ హోల్డర్ కిమ్మత్తు ధర : రూ.1,00,000/-
అమీనా కిమ్మత్తు ధర : రూ.10,00,000/-

ఎం.సిహెచ్.కృష్ణమాచార్యులు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 70360 76151